

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,24 డిశంబర్ 2025

8 పేజీలు


## కాకినాడలో పాలనా

# 'ప్రభంజనం'



### కమిషనర్ సత్యనారాయణ మార్క్ సంస్కరణలు !




**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ఒక అధికారి అంకితభావం, ప్రజాప్రతినిధుల సంకల్పం తోడైతే వ్యవస్థలో ఎంతటి విప్లవాత్మక మార్పులు సాధ్యమో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ నిరూపిస్తోంది. కమిషనర్ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నగరం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఆయన సరికొత్త వేదికను సృష్టించారు.

**ప్రజా ప్రతినిధుల అండ.. అభివృద్ధికి దండి!**

కాకినాడను పారిశ్రామికంగా,ఆర్థికంగాఅభివృద్ధిపథంలో నడిపించేందు కు స్థానిక ప్రజా ప్రతినిధులు నిరంతరం శ్రమిస్తున్నారు. పార్లమెంట్ సభ్యులు టీ టైం ఉదయ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలువనమాడి కొండబాబు (కాకినాడ సిటీ), పంతం నానాజీ(కాకినాడరూరల్) తమదైనశైలిలో

- తరువాయి 2లో..

- ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రగతి పథంలో స్మార్ట్ సిటీ
- రాష్ట్రంలోనే బిపిఎస్ నమోదు కమిషనర్, డిసిపిల మార్క్
- తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయి తనిఖీలు
- డిజిటల్ విప్లవంతో పారదర్శక సేవలు
- కబ్జాదారుల సింహ స్వప్నం
- పేదల పాలిట అక్షయపాత్ర
- నగర సేవలో అలుపెరగని సైనికుడు కమిషనర్ సత్యనారాయణ
- కమిషనర్ పనితీరుపై నగరవాసుల నీరాజనాలు

## శాస్త్రీయ దృక్పథంతోనే సామాజిక సమస్యలకు పరిష్కారం

### – ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి






**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే సమాజంలోని సమస్యలకు సరైన పరిష్కారాలు లభిస్తాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ఉద్ఘాటించారు. కాకినాడలోని జె.ఎన్.టి.యు.కె ప్రాంగణంలో గత మూడు రోజులుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు మంగళవారంతో ముగిశాయి.

**సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలి**

ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన గోపిమూర్తి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు, ప్రగతి ఫలాలు సామాన్య ప్రజలందరికీ చేరువ కావాలని ఆకాంక్షించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే హేతుబద్ధమైనఆలోచనా విధానాన్ని అలవరుచుకోవాలని కోరారు.

**38 ఏళ్ల జెవివి ప్రస్థానం..** కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా గత 38 ఏళ్లుగా జె.వి.వి. కృషి చేస్తోందన్నారు.మూఢనమ్మకాల నిర్మూలన,పర్యావరణ పరిరక్షణ, అందరికీ నాణ్యమైన విద్య,వైద్యం కోసం

- తరువాయి 2లో..

## సర్ ఆర్థర్ కాటన్ సంక్రాంతి సంబరాలను
## విజయవంతం చేయాలి

### – జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్




**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ సంక్రాంతి సంబరాలు సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవాల ను జనవరి 11 నుండి 13వ తేదీ వరకు అత్యంత వైభవం అంగరంగ వైభవంగా ప్రశాంత వాతావరణంలో జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆర్డీవో, పర్యాటక, జలవనరులు, పోలీస్ అధికారులతో సమా వేశం నిర్వహించి కోనసీమ సంక్రాంతి సంబరాల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు.జనవరి 11వ తేదీ ఉదయం ఏడు

- తరువాయి 2లో..

## దేశ ఆర్థిక వ్యవస్థకు
# వెన్నెముక రైతన్న

### – అన్నదాతలకు జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :**జాతీయ రైతుదినోత్సవ సందర్భంగా రైతు సోదరు లందరికీ రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక వంటివారన్నారు. "దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలైన రైతు లందరికీ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు. రైతుల శ్రమే రాష్ట్ర అభివృద్ధికి పునాది. ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలకు దేశం రుణపడి ఉంది.అన్నదాతలైన రైతులకష్టం,కృషి వెలకట్టలేనివి. వారి జీవనప్రమాణాలు మెరుగు పడేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది. విత్తనం నుంచి పంట వరకు ప్రతి అడుగులో శ్రమించే రైతులత్యాగంఅమూల్యం. రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలుచేసివారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటున్నాం. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. రైతుల శ్రమకు తగిన గౌరవం, పంటకు గిట్టుబాటు ధరకల్పించడమే మాప్రభుత్వం బాధ్యత. అన్నపూర్ణులైన రైతాంగం సుఖసంతోషాలతోవర్ధిల్లాలి.. రైతులందరికీ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు." అని మంత్రి రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాకినాడలో పాలనా 'ప్రభంజనం'







మొదటిపేజీ తరువాయి

నగరాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. వీరి మార్గనిర్దేశంలో కమిషనర్ సత్యనారాయణ ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తూ, కార్పొరేషన్‌ను ఒక'సమస్యల పరిష్కార వేదిక'గా మార్చారు.

**రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో బిపిఎస్ నమోదు**

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ(బిపిఎస్) స్కీమ్‌ను అమలు చేయడంలో కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణారావుల ద్వయం అద్భుత ఫలితాలను సాధించింది.వీరి సమన్వయం తో రాష్ట్రంలోనే మరెక్కడా లేని విధంగా కాకినాడలో అత్యధిక దరఖాస్తులు నమోద య్యాయి. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంలో వీరి పాత్ర అనిర్వచనీయం.

**తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయి తనిఖీలు**

ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా, తెల్లవారుజామున 5 గంటలకే కమిషనర్ రోడ్లపై ప్రత్యక్షమవుతున్నారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తూ 'స్వచ్ఛ కాకినాడ'ను సాకారం చేస్తున్నారు.

**అన్నా క్యాంటీన్ల పర్యవేక్షణ:** పేదవాడి ఆకలి తీర్చే అక్షయపాత్ర అన్నా క్యాంటీన్లలో ఆహారాన్ని ఆయనే స్వయంగా రుచి చూసి,నాణ్యతను నిర్ధారిస్తూ మంచి ఆహారాన్ని ప్రజలకు పంపిణీ చేయిస్తున్నారు.

**నీటి సమస్యకు చెక్..**గతంలో కుళాయి నీటిలో వచ్చే సమస్యలను పరిష్కరించి, వాటర్ వర్క్స్ తనిఖీల ద్వారా స్మార్ట్‌సిటీ నగర ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

**డిజిటల్ విప్లవం – సుందర నగరం**

మున్సిపల్ సేవల్లో అవినీతికి తావులేకుండా 'పేపర్ లెస్' పాలనను ప్రవేశపెట్టారు. అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ వ్యవస్థను గాడిలో పెట్టి, అక్రమ ఆక్రమణలను తొలగించి, రంగురంగుల సిగ్నల్స్‌తో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

**సమష్టి కృషి – సమిష్టి విజయం కమిషనర్ సారథ్యంలో అధికారుల బృందం అహర్నిశలు శ్రమిస్తోంది.**

– సహాయ కమిషనర్ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డిసిపి కృష్ణారావు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

– ఆరోగ్య విభాగంలో హెల్త్ ఆఫీసర్ పృథ్వీ, శానిటరీ సూపర్వైజర్లు రాంబాబు, సత్తిప్ప నాయుడు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వందలాది మంది పారిశుధ్య సిబ్బంది పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తున్నారు.

– రెవెన్యూ విభాగంలో శిరీష్ పారదర్శకమైన సేవలందిస్తున్నారు.

ప్రజా ప్రతినిధుల రాజకీయ సంకల్పం, అధికారుల పాలనా దక్షత తోడవడంతో కాకినాడ జిల్లా కేంద్రం ఇప్పుడు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా పరిస్థితులు మారుతున్నాయి."నిజాయితీ గల అధికారులు, బాధ్యత గల నేతలు ఉంటే మార్పు ఎలా ఉంటుందో కాకినాడను చూస్తే అర్థమవుతుంది" అని నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందని వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామచంద్రరాజు లు అన్నారు. మంగళవారం ఆత్రేయపురం సొసైటీ గోడౌన్‌లో ఉన్న యూరియా నిలవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరు ఇబ్బందులు పడవలసిన అవసరం లేదని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండాఅవసరమైన పనులు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# హాస్టల్‌లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం మండలం శరభవరం బాలికల హాస్టల్ లో డ్రైనేజీ వ్యవస్థ తక్షణమే ఏర్పాటు చేయాలని పారా లీగల్ వాలంటీర్స్ డిమాండ్ చేసారు. వ్యాధుల బారి నుండి విద్యార్థులను కాపాడాలని, మురుగునీరు డ్రైనేజీ ద్వారా బయటికి వెళ్ళకపోవడంతో దుర్గంధం వెద జల్లుతుందన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం పరిధిలోని శరభవరం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల హాస్టల్‌లో 77 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారన్నారు. ఈ విద్యార్థినులు హాస్టల్‌లో వాడిన మురుగునీరు, వంట చేసిన తరువాత వాడిన మురుగునీరు డ్రైనేజీ ద్వారా హాస్టల్ నుండి బయటకు వెళ్లకపోవడంతో డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజలడంతో పాటు దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కోతులు హాస్టల్లోకి వచ్చేస్తున్నాయన్నారు. కాబట్టి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శరభవరం ఆశ్రమ బాలికల పాఠశాల హాస్టల్‌లో డ్రైనేజీలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు వ్యవస్థ తక్షణమే ఏర్పాటు చేసి విద్యార్థినుల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. హాస్టల్ ప్రహరీ చుట్టు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, విద్యార్థినులు ఆడుకొనేందుకు ఆటస్థలం ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరారు. పారా లీగల్ వాలంటీర్స్ మంగళవారం ఏర్పాటు చేసిన బాల్య వివాహాలు చట్ట విరుద్ధం అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సులో తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్స్ తెల్లం శేఖర్, యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథంతోనే సామాజిక సమస్యలకు పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**చెకుముకి సంబరాల్లో 4.6 లక్షల మంది విద్యార్థులు**

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో దాదాపు 4.6 లక్షల మంది విద్యార్థులు పాల్గొనడం సైన్స్ పట్లవారికిఉన్నఆసక్తికి నిదర్శన మన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయోగాల రౌండ్, క్విజ్, రాత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే నెలలో 'యురేకా' సైన్స్ ప్రయోగాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

**రాష్ట్ర స్థాయిలో విజేతలు వీరే :**రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

**ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం:** ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ స్కూల్ (కర్నూలు); ద్వితీయ స్థానం: శ్రీ నరసింహ గవర్నమెంట్ హై స్కూల్ (గుంటూరు); తృతీయ స్థానం: జెడ్ పి హెచ్ ఎస్ (బాలికలు), బుదిరెడ్డిపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా) సాధించగా, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం: ది ఎతేనా స్కూల్ (కర్నూలు); ద్వితీయ స్థానం: శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ (వైయస్సార్ కడప); తృతీయ స్థానం: ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ (కాకినాడ) సాధించాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, సత్యా స్కాన్ డైరెక్టర్ డాక్టర్ కాదా వెంకటరమణ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.మురళీధర్, జె.వి.వి. మరియు యుటిఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్ ఆర్డర్ కాటన్ సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

గంటల నుండి ఆత్రేయపురం కాలువ లాకులు నందు స్విమ్మింగ్ పోటీలు ప్రారంభిస్తారని, ప్రథమ బహుమతిగా రూ.8వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4 వేలు ప్రకటించినట్లు తెలిపారు. అదే రోజు ఉదయం 9గంటల నుండి రంగోలి ముగ్గుల పోటీలు ఆత్రేయపురం ప్రధాన రహదారిపై నిర్వహించి ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ప్రకటించారన్నారు. జనవరి 13వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు ఆత్రేయపురం కెనాల్ వద్ద గాలిపటాల పోటీలు ప్రారంభిస్తారని వీటిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా 3 వేలు ప్రకటించనున్నట్లు తెలిపారు. డ్రాగన్ బోట్ ఫెస్టివల్ జనవరి 12,13 తేదీలలో ఆత్రేయపురం కాలువ లొల్ల లాకులు డౌన్ స్ట్రీమ్ నందు ఉచ్చిలి దేవాలయం నుండి బ్రిడ్జ్ వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ పోటీలలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి సుమారుగా 28 టీములు పాల్గొనే అవకాశం ఉందని, మొదటి స్థానంలో నిలిచిన బృందానికి రూ.2 లక్షలు, ద్వితీయ స్థానంలో గెలుపొందిన బృందానికి లక్ష రూపాయలు బహుకరించడం జరుగుతుంద న్నారు.

ఈ సంక్రాంతి సంబరాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జనవరి 11వ తేదీ రాత్రి 7 గంటలకు సినీ ఆర్కెస్ట్రా కార్యక్రమం ఆత్రేయపురం హై స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుం దన్నారు. అదే విధంగా 12వ తేదీ రాత్రి 7 గంటల నుండి బాండ్ సేహరి మ్యూజికల్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సంబరాలలో పాల్గొనేందుకు రోజువారీగా వచ్చే పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్, మొబైల్ టాయిలెట్లు, పర్యాటకుల ఆరోగ్య భద్రతకై పీహెచ్‌సి వైద్యులతో కూడిన వైద్య శిబిరాలు లాకుల వద్ద హై స్కూల్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈత పోటీలకు గాను జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ వారి పర్యవేక్షణలో డ్రిల్ మాస్టర్లను నియమించి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు బలోపేతం చేయాలన్నారు. రంగోలి పోటీలలో పాల్గొనేందుకు ఇప్పటివరకు 100 మంది మహిళలు నమోదయినట్లు తెలిపారు.

వచ్చిన అతిథులకు రావులపాలెం సిఆర్‌సి సిరి గార్డెన్స్ తదితర ప్రదేశాల్లో వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త పేట ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా పర్యా టక అధికారి అన్వర్, డి.ఎస్.పి. ఏ.మురళీమోహన్, ఎంపీడీవో వెంకట రామన్ మత్స్యశాఖ ఏడి వర్ధన్, జలవరులశాఖ ఎస్సీ గోపి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వస్తు సేవల వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

– ప్రిన్సిపల్ డి.సునీత



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగ దారుల హక్కుల దినోత్సవంను కళాశాల వాణిజ్య విభాగ అధ్యాపకులు వి.రామ రావు, డా.బంగార్రాజు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా. డి. సునీత అద్యక్షత వహించి మాట్లాడుతూ ఒక దేశం ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులు కీలక పాత్ర వహిస్తారని, తయారు అయ్యే వస్తువులు కానీ, సేవలను వినియోగదారులు వాడకుంటే , ఉత్పత్తిదారులకు ఉత్పత్తి చేయడానికి ప్రేరణనే ఉండదని. ఆర్థిక రంగం, వ్యాపార రంగం , ప్రచార రంగాలలో వినియోగ దారుడు కీలక భూమిక పోషిస్తాడని అటువంటి వినియోగ దారుని హక్కులు పరిరక్షించే భాద్యత కంపెనీలు మరియు సంస్థల పై ఉందని వినియోగదారుల రక్షణ చట్టం భారతదేశంలో 1986 డిసెంబర్ 24న అమల్లోకి వచ్చిందని, అప్పటినుండి ప్రతి ఏట ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని .సాంకేతికత పెరగడంతో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, టెలి మార్కెటింగ్ తదితరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో వినియోగదారుల కోసం కేంద్ర ప్రభుత్వం పాత చట్టం స్థానంలో 2019లో కొత్త రక్షణ చట్టం రూపొందించిందన్నారు. 2020 జులై 20 నుంచి ఇది దేశమంతటా అమల్లోకి వచ్చిందని. వినియోగదారుడా మేలుకో' అనే నినాదంతో వినియోగదారుల వ్యవహారాలు ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కొత్త చట్టంలో ఈ కామర్స్ నిబంధనలు తీసుకురావడంతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలకు కూడా ఇది వర్తించనుందన్నారు. జిల్లా స్థాయిలో కంజ్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్ ఉంటుందని వస్తు సేవల్లో లోపాలు జరిగితే ఈ కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయవాది సాయం లేకుండా నేరుగా ఫిర్యాదు చేసే వీలు కలిగిందన్నారు.

# ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజా శేఖరంను మర్యాదపూర్వకంగా కలిసిన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన జ్యోతుల నవీన్ మంగళవారం ఉమ్మడి గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజా శేఖరంను కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా పేరాబత్తుల రాజా శేఖరం ను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం అందజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, భవిష్యత్ కార్యాచరణపై వారి ఇరువురు చర్చించుకున్నారు.

ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నాకు జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి అవకాశం కల్పించిన చంద్రబాబుకి, నారా లోకేష్‌కి, పల్లా శ్రీనివాస్‌కి, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అదే విధంగా కాకినాడ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ ఇన్చార్జిలు, రాష్ట్ర కమిటీ నాయకులు అందరూ నాకు సహకరించినందుకు వారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసినందుకు రెండు రోజులుగా జిల్లా అంతా



తిరుగుతున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూము కుమార్, బస్వా చినబాబు, ప్రకాష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం లోని ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహంలో నివసిస్తున్న విద్యార్థినులతో ఆమె మాట్లాడి వారి బాగోగులు, విద్యా పరిస్థితులు, ఆరోగ్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని శ్రీలక్ష్మి సూచించారు. వసతి గృహంలో ఆహారం నిర్దేశిత మెనూ ప్రకారం అందిస్తున్నారా.? సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా..? అనే విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినిలకు మంచి చెడుల స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, క్రమశిక్షణ, సహనశీలత వంటి గుణాలు జీవితంలో అత్యంత ముఖ్యమైనవని, వాటిని అలవరుచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. వసతి గృహంలో ఏవైనా సమస్యలు ఉన్నా, లేదా న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, ఇందుకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 15100 ను ఉపయోగించుకోవచ్చని ఆమె తెలియజేశారు.

# ఉపాధి హామీ పనులలో నాణ్యత, పారదర్శకతతో లక్ష్యాలను పూర్తి చేయాలి

– డిడిఓ ఎం.శ్యామల



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పనుల అమలులో నాణ్యత, పారదర్శకతతో పాటు నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, పెద్దాపురం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిణి ఎం.శ్యామల ఆదేశించారు. మంగళవారం పెద్దాపురం డిడిఓ కార్యాలయములో డివిజన్ పరిధిలోని ఎపిడి ఎం.భానుప్రకాష్‌తో పాటు ఎపిఓలతో ఉపాధి హామీ పనులు లక్ష్యాలపై సమీక్ష ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పురోగతి చర్చలలో భాగంగా 2023–26లో కార్మిక బడ్జెట్‌కు అనుగుణంగా మాన్‌డేస్ సృష్టి సాధించిన పురోగతి, 2025–26 సంవత్సరానికి గాను చేపట్టనున్న ప్లాంటేషన్ కార్యక్రమాలు, 31 డిశంబర్ 2025 వరకు కార్మిక నివేదికల స్థితిగతులు, టిఎ క్లస్టర్ వారీగా సెల్ఫ్ ఆఫ్ వర్క్ వంటి అంశాలను ఆమె సమీక్షించారు. అదే విధంగా ఈకెవైసి జనరేషన్, 2026–27 సంవత్సరానికి ప్రణాళిక రూపకల్పన, పశువుల షెడ్ల స్థితి, హౌసింగ్‌కు సంబంధించిన 90 మాన్‌డేస్ అమలు, పశువుల తొట్టెలు, సాక్ పిట్స్, ఫారమ్ పండ్స్, సిసి రోడ్లు, సెరీ కల్చర్ వంటి అంశాలపై ఏపిఓలతో ఆమె సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎపిఓలు, డిపిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి

– శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఈ నెల 30వ తేది మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 3.30 నుండి 4 గంటల వరకు మేలుకోలుపు, 4 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం 6గంటలకు గ్రామ సేవ, శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం వరకు ఎదురుకోలు సన్నాహ ఉత్సవం నిర్వహించబడునని దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వీర్రాజు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కె.జగదీశ్వరరావులు తెలిపారు.

దీనిలో భాగంగా రాత్రి 7 గంటల నుండి తాళాబత్తుల సావిత్రిచే కర్ణాటక సంగీత కార్యక్రమం నిర్వహించ బడునని, స్పెసిఫిక్ ఎండోమెంట్స్ వంశస్థులు ఆర్థిక సహకారంతో 10 కెజిల పులిహోర ప్రసాద వితరణ చేయబడునని, భక్తులకు ఉచిత దర్శనం, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. కావున భక్తులు, ప్రజలు శ్రీ స్వామివారిని దర్శించి తరించవలసినదిగా వారు కోరారు.

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# వినియోగదారుల హక్కులపై అవగాహన ర్యాలీ

**– డిసెంబర్ 24 ఎస్కేవిటి పాఠశాల ఆవరణలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ముగింపు సభ**

**– జిల్లా పౌర సరఫరాల అధికారి వి.పార్వతి**



**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** వినియోగదారుల్లో హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడంలో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎస్కేవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి గంధం గనిరాజు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి ర్యాలీని ప్రారంభించి వినియోగదారులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వినియోగదారుల రక్షణ చట్టం–2019 ద్వారా కల్పించిన హక్కులను ప్రతి వినియోగదారుడు తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్రమ వ్యాపార విధానాలు, మోసపూరిత ప్రకటనలకు లోను కాకుండా నాణ్యమైన వస్తువులు, సేవలనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

జాతీయ వినియోగదారుల దినోత్సవం– 2025 సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారుడనైన నేను కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవడం, ఎంఆర్పీ కంటే అధిక ధర చెల్లించకపోవడం, లేబుల్పై పేర్కొన్న నాణ్యత, పరిమాణం, ధర, స్వచ్ఛత వంటి అంశాలను పరిశీలించడం, సురక్షితమైన మరియు పర్యావరణహిత ఉత్పత్తులను ఎంచుకోవడం వంటి అంశాలపై విద్యార్థులు ప్రమాణం చేశారు. లోపభూయిష్ట వస్తువులు, పేలవమైన సేవలు, వినియోగదారుల దోపిడీపై అవసరమైతే వినియోగదారుల కమిషన్ను ఆశ్రయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 24న ఎస్కేవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా ముగింపు సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ ముగింపు సభకు జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ అధ్యక్షత వహించనున్నారని, వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియ జేశారు. ఈ ర్యాలీలో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ కుమార్, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టుముక్కల అనంతరావు, ఏఎస్ఓ ఎం.నాగాంజనేయులు, హెడ్మాస్టర్ ఎం.వి.ఎం. సుబ్రహ్మణ్యం, డీఎస్వో సిబ్బంది సుజాత, సురేష్, ఎస్కేవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి

**– సిఐ నరసింహమూర్తి**



**అడ్డతీగల, మేజర్న్యూస్:** ఏజెన్సీలోని ప్రజలంతా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం అడ్డతీగల మండలంలోని ఢీకొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డి రామవరం జంక్షన్ వద్ద గంజాయి రవాణా నాటు సారా వినియోగం రోడ్డు ప్రమాదాల నివారణ మొదలైన అంశాల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నరసింహమూర్తి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్న దృశ్య ఏజెన్సీలోని యువకులు కోడిపందాలు పేకాట గంజాయి వినియోగం మరియు రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని లేని పక్షంలో కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే పండగ సంబరాలు ముగిసే వరకు ప్రతి ఒక్క వాహనదారుడు ప్రయాణాలలో రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు వాహనాలు నడిపేటప్పుడు అతివేగాన్ని నియంత్రించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. సెల్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరు సైబర్ నేరాలకు పాల్పడకుండా ఆన్లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. రాబోయే పండుగ సీజన్ కుటుంబ సభ్యుల సమక్షంలో సంతోషంగా నిర్వహించుకోవాలని గొడవలు కొట్లాటలో జోలికి వెళ్లొద్దని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఢీకొత్తూరు పోలీస్ సిబ్బంది చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**– పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవు**

**– బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే పోక్సో చట్టం ప్రకారం చర్యలు తప్పవని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి అన్నారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్ లో భాగంగా... కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి హెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు ఐసిడియస్ ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో... పిఠాపురం మండలం కుమారపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నందు బాల్య వివాహ ముక్త్ భారత్ మరియు పోక్సో చట్టం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి, పిఠాపురం ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ మరియు మానవ హారం నిర్వహించారు. బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ... బాల్య వివాహ ముక్త్ భారత్ కాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చి 2026 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాల్య వివాహ రహిత దేశంగా తీర్చి దిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను విద్యా రంగ సంస్థలలో నిర్వహిఒచడం జరుగుతుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తి కాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని, బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం మరియు నేరమని, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం మరియు అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు.

బాల్య వివాహాలు జరుతున్నట్లు సమాచారం తెలిసిన లేదా జరుగుతున్నట్లు చూసిన చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి ఉమెన్ హెల్ప్ లైన్ 181, లేదా పోలీస్ డయల్ 113 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలి

**– మండల లీగల్ సర్వీసెస్ కమిటీ**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** వినియోగదారులు తమ హక్కులను తప్పనిసరిగా తెలుసుకోవాలని, తమ హక్కుల పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుభాషిని అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి ఏ కె ఈశ్వర్ బాబు, గుదిమెళ్ళ శ్రీ భాస్కరాచార్యులు పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని, ఎందుకంటే ఇదే రోజున 1986లో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని, ఇది వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చారిత్రాత్మక మైలురాయి అని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతుల నవీన్ను అభినందించిన ఎమ్మెల్యే



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షులుగా జ్యోతుల నవీన్ ను రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించిన సందర్భంగా నవీన్ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నవీన్ ను ఎమ్మెల్యే రాజప్ప దుస్సాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మండల నాయకులు తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ళ రామకృష్ణ తదితరులున్నారు.

## భాష్యం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం స్థానిక వైయస్సార్ గార్డెన్స్ భాష్యం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లిటిల్ చాంప్స్ విద్యార్థులు రైతుల వేషధారణలో అలరించారు. సమీపంలోని పొలాలను సందర్శించి రైతులు చేస్తున్న వ్యవసాయ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతుల కష్టాన్ని, శ్రమను అర్థం చేసుకొని వారి సేవల పట్ల గౌరవ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు మాట్లాడుతూ భారతదేశ ఐదవ ప్రధానమంత్రి మరియు భారతరత్న చౌదరి చరణ్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ రైతు దినోత్సవం జరుపుకుంటామని, రైతుల కృషి వల్లే దేశానికి ఆహారం అందుతోందని, రైతుల పట్ల గౌరవం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఆదేశాల మేరకు ప్రతి విద్యా సంవత్సరం పాఠశాలలో రైతు దినోత్సవం జరుపుకున్నామని తెలియజేశారు. ప్రైమరీ హెచ్ఎం అరుణ మాట్లాడుతూ... రైతుల యొక్క కష్టం, శ్రమ చిన్నారులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం..

# నేర రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దుదాం!





- కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ పిలుపు
- వార్షిక నేర సమీక్షలో పోలీసు అధికారులకు దిశానిర్దేశం
- క్రైమ్ డిటెక్షన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాల అందజేత

**ఉమ్మడిగోదావరి జిల్లాలో సూర్యబ్యూరో :** కాకినాడ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా, ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ వ్యవస్థ పనిచేయాలని జిల్లా పోలీస్ బాస్, ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆకాంక్షించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిం చిన సంవత్సరాంతపు నేర సమీక్షా సమావేశంలో ఆయనముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులు,నేర నివారణ చర్యలు, అసాంఘిక కార్యకలాపాల అదుపుపై సుదీర్ఘంగా చర్చించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి..** ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులనుసత్వరమే పరిష్కరించాలని స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం చేకూరాలని, నేరస్తులకు శిక్ష పడేలా పక్కాగా దర్యాప్తు సాగాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని హెచ్చరించారు.

**అధికారుల సమక్షంలో విస్తృత చర్చ**

ఈ కార్యక్రమంలో కాకినాడ ఏఎస్‌పి, ఎస్డిపిఓ దేవరాజ్ మనీష్ పాటిల్ ఐపీఎస్, కాకినాడ ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ కె.వి.సత్యనారాయణ, పెద్దాపురం డి.ఎస్.పి. కె.శ్రీహరి రాజుతో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.ఎన్.మూర్తి మరియు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్న ఎస్పీ బిందు మాధవ్ వాటి పరిష్కారానికి సూచనలు చేశారు.

**ప్రతిభకు పట్టాభిషేకం..** నేర పరిశోధనలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ అభిన ందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినవారికి స్వయంగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

అధికారుల పనితీరును గుర్తిస్తే అది మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ప్రేరణనిస్తుందని ఆయన పేర్కొ న్నారు.ప్రజల పక్షాన ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎస్పీ బిందు మాధవ్ పనితీరుపై జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.

# పంచాయతీల ప్రగతిపై ఎంపిడిఓ సమీక్ష



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండల పరిధిలో గల పంచాయతీల ప్రగతిపై మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ సమీక్ష సమావేశం పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ, డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డితో కలసి ఇంటి పన్నుల వసూలు ప్రగతి, లక్ష్యాలపై పంచాయతీల వారీగా సమీక్షిం చారు. అలాగే త్రాగునీరు, సరఫరా మరియు శానిటేషన్‌పై పంచాయతీలలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను నిర్ణీత గడవులోగా పూర్తి చేయాలని తెలిపారు. పిజిఆర్‌ఎస్ వంటి వాటిపై సమీక్షించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు ఫణికుమార్, బి.వి.వి.రమణ, ఈశ్వరరావు, నక్కా సత్యనారాయణమూర్తి, శ్రీనివాసరావు, బషీర్, జానీఖాన్, కళావతి, అన్నపూర్ణ, పలువురు పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్లో జరిగిన కార్మికుని సజీవ దహనంపై నిరసన



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఇటీవల బంగ్లాదేశ్లో దీపు చంద్రుదాస్ అనే కార్మికుని అన్ని మతాలు సమానమే అన్న పాపానికి నిర్దాక్షిణ్యంగా కొట్టి నగ్నంగా చెట్టుకు వేలాడదీసి సజీవ దహనం చేసిన ముస్లిం ఉగ్రమూకలను అలాగే బంగ్లాదేశ్ ప్రధాని మహమ్మద్ యూనస్ ను వ్యతిరేకస్తూ ఏలేశ్వరం బాలాజీ చౌక్ వద్ద ఛత్రపతి శివాజి మహారాజ్ సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బిజెపి ప్రత్తిపాడు అసెంబ్లీ మాజీ కన్వీనర్ మాట్లాడు బంగ్లాదేశ్ లో హిందువులు కు మరణ శాసనం రాస్తున్నారని 1971 లో భారత్ సహాయంతో స్వాతంత్ర్యం పొంది భారత్‌పై వ్యతిరేక కార్యక్రమంకు పాల్గొంటున్నారన్నారు. అక్కడ హిందువులు దాదాపు లేకుండా చేసారని హిందూ ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని భారత్ భారతదేశంలో కూడా హిందువులకు రక్షణ లేకుండా పోయిందని మసీదులకు సెక్యూరిటీ ఉండట్లేదు, చర్చిలకి సెక్యూరిటీ అవసరం లేదు. 536 సంవత్సరాలు తరువాత అయోధ్యలో రాముడి గుడి కట్టుకుంటే సిఆర్పిఎఫ్ బలగాలు లేకుండా రాముడుని దర్శించుకునే పరిస్థితి లేదని అన్నారు. అలాగే హిందువులు సెక్యులర్ భావం వదిలేసి హిందువులుగా మారి సమాజంలో హిందూ మతం పట్ల జరుగుతున్న కుట్రని భవిష్యత్ తరాలకు చెప్పి ఈ లవ్ జిహాద్ ఉచ్చు నిన్ను మన మహిళా మూర్తులను కాపాడుకునే ప్రయత్నం చేయాలని భారతదేశంలో సిఏఏ, ఎన్ ఆర్ సి, త్వరగా అమలు చేసి పాకిస్తాన్ బంగ్లాదేశ్ ఉన్న హిందువులను భారతదేశం తీసుకురావాలని అలాగే అక్రమంగా నివసిస్తున్నటువంటి ఉగ్ర జాతిని ఈ దేశం నుండి తన్ని తరిమేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టెం వెంకటరమణ జిల్లా కార్యదర్శి రెడ్డి వరలక్ష్మి,గొల్లపూడి సత్యనారాయణ గొల్లపూడి గణేష్,మల్లా మురళి,ఎర్రంశెట్టి శైలజ నాని జగదీష్,కర్రీ సత్యం ఘట్టం సీతారాం, గొల్లపల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ కోసం కుర్చీలాట మాని అభివృద్ధికి సహకరించండి

**- జిల్లా మానవ హక్కుల సంఘం**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీలో చైర్మన్ కుర్చీ కోసం కుర్చీలాట మాని మున్సిపల్ కౌన్సిలర్లు అందరూ అభి వృద్ధికి సహకరించాలని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్యకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సందర్భ ంగా నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీలో కోటి 45 లక్షల రూపాయలు మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు వాయిదాలు వేయించుకుంటూ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు దీని కారణంగా మున్సిపాలిటీలో నిధులు మురిగిపోయే పరిస్థితి వచ్చింది. దీని కారణంగా నిధులు వెనకకు వెళ్లే ప్రమాదం ఉందన్నారు తక్షణం కౌన్సిల్ సమావేశం నిర్వహించి నిధులకు ఆమోదం తెలపాలని లేకపోతే నిధులు వెనక పోయే ప్రమాదం ఉందని మరో 3 నెలల్లో మున్సిపల్ ఎలక్షన్లు జరగనున్నాయని అభివృద్ధి పనులు జరగకపోతే ప్రజలు కౌన్సిల్ మిమ్మల్ని ప్రశ్నిస్తారని తక్షణం చర్యలు తీసుకుని సమావేశ నిర్వహించేలా చూడాలని కమీషనర్ ను కోరారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళు తున్నట్లు తెలిపారు. కమిషనర్ను కలిసిన వారిలో మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కుంచె నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మినీ గోకులాలు లక్ష్యాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో మినీ గోకులాలు లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ సూచించారు. మంగళవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలు నందు ఉపాధి హామీ పనులు నిర్వహణపై సమీక్ష సమావేశం ఎపిఓ సుధీర్, జె.ఇ. సతీష్ కుమార్‌ల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ జాబ్ కార్డులపై సమీక్షించి, ఉపాధి పనులు, లక్ష్యాలు, గోకులాల నిర్మాణాల లక్ష్యాలపై సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

## ఏలేశ్వరం మండలంలో యూరియా కార్డుల పంపిణీ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** లింగంపర్తి ప్రాథమిక సహకార పరపతి సంఘం వద్ద 20 టన్నులు, భద్రవరం రైతు సేవా కేంద్రానికి 10 టన్నులు, పెరవరం రైతు సేవ కేంద్రానికి 10 టన్నులు, తిరుమాలి రైతు సేవ కేంద్రం 10 టన్నుల యూరియా కార్డులు ద్వారా యూరి యా పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ వి రాజేష్ , సోసైటి ప్రెసిడెంట్ పెంట కోట మోహన్, పెంటకోటా శ్రీధర్, నూకతటి ఈశ్వరావు,వేమగిరి ధర్మరత్నం, కర్రి సుబ్బారావు,దేగల సత్యనారా యణ, వెమగిరి సత్యనందం, కర్రి సూర్యప్రకాష్, కునపురెడ్డి సుబ్బా రావు, జిగటపు సూరిబాబు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో రాజేష్ మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా అలాగే మన గ్రోమోర్ సెంటర్లోనైనా వ్యవసాయ శాఖ పంపిణీ చేసిన కార్డులను చూపించి రైతులు యూరియా పొందుతున్నారు. ప్రభుత్వం నడిపించే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఏవో రాజేష్ విజ్ఞప్తి చేశారు.

# బాల్యవివాహాలు చట్ట విరుద్ధం





**పెరవలి, మేజర్ న్యూస్ :** బాల్ వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు మల్లేశ్వరం హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిసెంబర్ 23వ తేదీ మంగళవారం అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడి సూపర్వైజర్ సరస్వతి, షేక్ హసీనా లు మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా చేస్తే అది బాల్య వివాహం అవుతుందని, ఈ యొక్క బాల్య వివాహానికి ఎవరైతే సహకరిస్తారో, ప్రయత్నిస్తారో, చేస్తారో వారిపై బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 ప్రకారం రెండూ సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయలు జరిమానా లేదా రెండూ విధించడం జరుగుతుందని తెలియజేసారు, విద్యార్థులు ఎవరైనా బాల్య వివాహన్ని ఎదురకోవాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు తల్లిదండ్రులకు కూడా ఖచ్చితంగా చెప్పాలి బాల్యవివాహం వద్దని అలాగే మంచిగా చదువుకుని అభివృద్ధి చెందుతూ, వ్యక్తిగత భద్రత కూడా చాలా అవసరమని తల్లితండ్రులు మరియు గురువులు చెప్పిన మాట వింటూ అభివృద్ధి చెందాలని అలాగే మంచి స్పర్శ మరియి చెడు స్పర్శ గురించి అవగాహన కలిగి ఉండాలి, ఎవరి స్పర్శ తగిలితే చాలా సంతోషంగా, చాలా ఆనందంగా, చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుందో ఆది మంచి స్పర్శ అని ఇది కేవలం తల్లిదండ్రులు ద్వారా మాత్రమే కలుగుతుందని చెప్పారు, చెడు స్పర్శ అనేది ఎవరు మనల్ని ముట్టుకుంటే చాలా చికాగుగా అనిపిస్తుందో, ఎవరు ముట్టుకుంటే ఇబ్బందిగా ఉంటామో, ఎవరు ముట్టుకుంటే అసహ్యంగా అనిపిస్తుందో అది చెడు స్పర్శ అని చెప్పారు, బాలల యొక్క శరీర రహస్య భాగాలను ఎవరు కూడా ముట్టుకోడానికి వీలులేదు, ఎవరైనా ముట్టుకోడానికి ప్రయత్నిస్తే ఖచ్చితంగా డోంట్ టచ్ అని చెప్పాలని తెలియజేసారు. మీయొక్క ఉజ్వల భవిష్యత్తు బంగారు బాట వెయ్యాలి, జీవితంలో ఎప్పుడు తల ఎత్తుకునేలా జీవించాలి అటువంటి ఉన్నత శిఖరాలకు అందరూ ఎదగాలని చెప్పడం జరిగింది. మాట్లాడుతూ బాలల హక్కులు అయినటువంటి జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కులను గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది, బాలలపై లైంగిక వేధింపుల నిర్మూలన వ్యతిరేక చట్టం -2012 గురించిన విషయాలు వివరించడం జరిగింది, కాబట్టి ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిసిన, బాలలపై వేధింపులు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ -1098, పోలీస్-100 మరియి 112 అనే నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

## కౌశల్ పరీక్షలో పవర ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ



సామర్లకోట, మేజర్ న్యూస్ : పవర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని నిమ్మన తేజశ్రీ కౌశల్ పరీక్షలో మన జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎంపిక అయిన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రము మెమొంటో మరియు 1000 రూపాయల నగదు బహుమతిని బహుకరించడమైనది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1వై శివరామకృష్ణయ్య మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవివివి గోపాలరావు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాకినాడలో కార్పొరేషన్ సామాజిక స్థలాల పరిరక్షణకు చర్యలు

**– దుర్గా విద్యుత్ నగర్‌లో నోటీసు బోర్డు ఏర్పాటు**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలో కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నగరంలోని దుర్గా విద్యుత్ నగర్‌లో ఉన్న కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలంలో అధికారులు నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, నగర పరిధిలో కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలాలను అక్రమ ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆయా స్థలాల్లో స్పష్టంగా నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డిసిపి కృష్ణరావు, ఏసిపి శ్రీధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వేజనా సుఖినోభవంతు సంస్థ వార్షికోత్సవం పత్రిక ఆవిష్కరణ



సామర్లకోట, మేజర్ న్యూస్ : స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్ సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నందు ప్రముఖ వ్యాపారవేత్త కటకం రాంబాబు చేతుల మీదుగా సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సంస్థ బృందం 9వ వార్షిక పత్రికను ఆవిష్కరించడం జరిగింది తొలిత పత్రికను ఆయనకి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ కాపవరపు కుమార్ కేకే మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు స్థాపించి తొమ్మిది సంవత్సరాలు అయ్యి పదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా నైన్త్ యానివర్స్ డే ఫంక్షన్ సామర్లకోట పట్టణం బల మార్కెట్ సెంటర్ సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నందు 26 అనగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్ణయించింది. అలాగే ఈ సంస్థ ద్వారా అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషదాయకంగా ఉందని ఈ సంస్థ ద్వారా గా మరిన్ని కార్యక్రమాలు చేయాలని ప్రజలకి సమాజానికి ఒక శ్రేయోభిలాషులా ఉండాలని ఈ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని కుమార్ అన్నారు. సంస్థ ఆర్గనైజర్స్ అడబాల వీరభద్రరావు మాట్లాడుతూ.. సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థనే సంస్థ ద్వారా మేము ఈ కార్యక్రమాలు చేయడానికి చేస్తున్నందుకు మేము చాలా సంతోషపడుతున్నామని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడానికి మేము ఎప్పుడూ ముందుంటామని ఈ సందర్భంగా అడబాల అన్నారు. మరో ఆర్గనైజర్ డాక్టర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమంలో పాల్గొన్న నాకు ఎలాంటి కార్యక్రమాలు చేయాలంటే చాలా ఆసక్తిని ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి నేనెప్పుడూ ముందుంటాము అలాగే సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఈ కార్యక్రమాలు చేయడం మాకు చాలా సంతోషదాయకంగా ఉందని ప్రజలందరూ కూడా సంతోషంగా ఉండాలి సమాజం ఆరోగ్యంగా ఉండాలని పంచభూతాలు ఆరోగ్యం ఉంటే మనమందరం ఆరోగ్యంగా ఉంటామని రాంబాబు అన్నారు.

## 26న కృత్రిమ అవయవాల గుర్తింపు శిబిరం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** జిల్లా దివ్యాంగల పునరావాస కేంద్రం నిర్వహణా సంస్థ అయిన ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం సామర్లకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగల కోసం అవసరమైన కృత్రిమ పరికరాలు కొరకు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపిడివో కె హిమ మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ శిబిరంలో ప్రధానంగా ఇప్పటికే దివ్యాంగులు వాడుతున్న పాత కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌కు మరమ్మత్తులు, కొత్త కృత్రిమ అవయవాల కోసం వ్యక్తిగత కొలతలు తీసుకోవడం, కొత్త కాలిపర్స్ కోసం కొలతలు తీసుకోవడం, వీల్చైర్, ట్రైసైకిల్స్ అవసరమైన వారిదగ్గర నుండి దరఖాస్తులు స్వీకరణ, వినికిడి లోపం కలిగిన వారిని పరీక్షించి హియరింగ్ ఎయిడ్స్ అందించేందుకు గానూ అవసరమైన వారి నుండి దరఖాస్తులు స్వీకరణ చేపట్టానున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి హాజరు అయ్యే దివ్యాంగలు సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, రేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలాన్నారు. దీనికిగానూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని అర్హులైన దివ్యాంగలను గుర్తించి, వారికి ఈ శిబిరం వివరాలు తెలియజేసి, ఈ నెల 26న జరిగే శిబిరానికి హాజరయ్యేలా ప్రోత్సహించి, అవసరమైన సహకారం అందించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మండల పరిధిలోని ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఎంపిడివో హిమ మహేశ్వరి తెలిపారు.

## గంజాయి- సారాయి జోలికి పోవద్దు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

**– సిఐ గౌరీ శంకర్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గంజాయి– సారాయి వంటి వాటి జోలికి పోవద్దని రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ గౌరీ శంకర్ అన్నారు. జడ్డంగి స్టేషన్ పరిధిలోని పరిధిలోని చిన్నయిపాలెం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌరిశంకర్, జడ్డంగి ఎస్ఐ చినబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి, సారా (అక్రమ మద్యం) వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి కారణంగా కుటుంబాలు, సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. గంజాయి, సారా వంటి అక్రమ కార్యకలాపాల్లో ఎవరైనా పాల్గొంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలానే రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. బాల్యవివాహాల దుష్పరిణామాలు గురించి వివరించి, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం చిన్నయిపాలెం యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

యువత క్రీడలవైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలు

**– కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి సూచన మేరకు ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. మంగళవారం కాకినాడ నగరంలోని రేచర్లపేటలో 4,5,6,7,8 డివిజన్లకు సంబంధించిన ప్రజా దర్బార్‌ను నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొని ఆయా డివిజన్ల నుంచి భారీగా తరలివచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ కూడా పాల్గొని అర్జీదారులను పలకరించారు. అదేవిధంగా మధ్యాహ్నం పరలోపేటలోని ఏ.ఎం.జి. స్కూల్ వద్ద 9, 10, 11, 12, 13 డివిజన్లకు సంబంధించిన ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పెన్షన్లు, ఇల్లు – స్థలాల మంజూరు, ఒంటరి మహిళ పెన్షన్ వంటి వ్యక్తిగత సమస్యలతో పాటు డ్రైనేజీ నిర్మాణం, దోమల నివారణ చర్యలు, వీధిలైట్లు సరిగా వెలగకపోవడం వంటి పౌర సమస్యలపై పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డివిజన్‌వారీగా నాలుగు డివిజన్లకు ఒకేచోట ప్రజా దర్బార్ నిర్వహించే విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డు చేసి, దానికి తగిన పరిష్కారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్ఈపీ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, ఏసీపీ శ్రీధర్, కార్పొరేషన్ సెక్రటరీ లక్ష్మి, కార్పొరేషన్ మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పాలక మండళ్ల ప్రమాణ స్వీకారం

**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలోని శ్రీ కేశవ స్వామి వారి ఆలయం శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారి ఆలయాలకు పాలక మండళ్ల ప్రమాణస్వీకార కార్యక్రమం డిసెంబర్ 23వ తేదీ మంగళవారం ఘనంగా జరిగింది. తీపర్రు గ్రూపు దేవాలయాల ఈవో మంగళంపల్లి వెంకటరామయ్య రెండు దేవాలయాలకు చెందిన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముక్కామల శ్రీ కేశవ స్వామి వారి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా మారిశెట్టి శివ చింత భాస్కరరావు (రాజు), సభ్యులుగా ఉమ్మడి చిన్న రామన్న, కవికొండల నరసింహారావు ఎల్లమెల్లి సూర్యప్రకాష్ రావు దాసరి రమాదేవి వేంద్ర తులసి మట్టా దుర్గాభవాని ఓదూరి లక్ష్మి ఎక్స్ అఫిషియో సభ్యులుగా పెరవలి ధనుంజయాచార్యులు అర్చకుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఉమా సోమేశ్వర స్వామి వారి ఆలయ పాలకమండలి చైర్మన్ గా నిడదవోలు చంటి, సభ్యులుగా మారే గోవిందరాజు, వెంద్ర బాలాజీ, ముత్యాల పట్టాభిరామయ్య, తుమ్మలపల్లి మణికంఠ, నరుకుల పద్మావతి, దూనబోయిన భాగ్యలక్ష్మి, పప్పు వెంకట నాగ సాయి రామలక్ష్మి, ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా పూజ్యం సోమేశ్వర ఫణి కుమార్ అర్చకుడు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో



గ్రామ పెద్దలు కరటూరి విశ్వనాథం, కడియాల సాయిరామారావు, బోళ్ల మంగారావు, తుట్టకుంట అచ్యుతరామయ్య, కూటమి నాయకులు నల్ల సురేంద్ర, వేంద్ర వెంకట రామమూర్తి, అక్కిన రాజు, చిన్నంశెట్టి శ్రీనివాస్, వేంద్ర బుల్లయ్య, రేలంగి రాజేష్, చిట్టిడి త్రిమూర్తులు, ఓదురి నరసింహస్వామి, మారిశెట్టి దుర్గారావు, కొత్తపల్లి సత్యనారాయణ సహా భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ & పి.జి కళాశాలలో ఉచిత దంత వైద్య పరీక్షలు






**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ&పి.జికళాశాలలో ఉచిత దంతవైద్య పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ&పి.జి కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా.బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూఈశిబిరంలో అనుభవజ్ఞులైన దంత వైద్యులు కళాశాల విద్యార్థినీలు, సిబ్బంధికి దంతాల పరిశీలన చేసి, దంత సమస్యలపై సరైన సూచనలు విద్యార్థినీలకు తెలియజేశారు. మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కనీసం ఆరు నెలలకు ఒకసారి దంత వైద్య పరీక్ష చేయించుకోవడం ఎంతో అవసరమని అలాగే శరీర ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనది అని తెలియజేశారు. మొదటిసారిగా కాకినాడలో ఫిజికల్ కాంటెక్ట్ లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అమరిక, పటిష్టతను పరీక్షించటం జరిగుతుందని తెలిపారు. స్థానిక కాకినాడలో గల షీబా డెంటాల్ వారి ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా దంత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దంత వైద్యురాలు షీబా మరియు వారి బృందం పాల్గొని దాదాపు 300 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంత ఆరోగ్యం గురించి అవగాహన కల్పిస్తూ, దంత సంబంధీత సమస్యలు నివారణకు సూచనలు అందించారు.ఈ శిబిరంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్, మాట్లాడుతూ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని, ఉచిత సేవలను వినియోగించుకున్నారు అని తెలియజేశారు. కార్యక్రమంలలో నిపుణులైన దంత వైద్యులు వారి బృందం, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, యమ్.శ్రీనివాసవావు, ఫిజికల్ డైరెక్టర్ యన్.సత్యవతి, అస్టిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## చిన్న రామాలయానికి విలువైన వెండి సాయిబాబా విగ్రహం బహుకరణ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మేరకు వీధిలో గల రామాలయానికి గ్రామానికి చెందిన గాదిరాజు వెంకట కృష్ణంరాజు, రాధ దంపతుల కుమారుడు గాదిరాజు సాయి జోగేశ్ వర్మ, భావన లక్ష్మీ దంపతులు మంగళవారం 600 గ్రాములు వెండి, రూ.1.25 లక్షల విలువ గల వెండి సాయిబాబా విగ్రహాన్ని బహుకరించారు. ఈ విగ్రహానికి సంప్రోక్షణ పూజలు జరిపి ఆలయ కమిటీ సభ్యుడు ఇసుకపల్లి సుబ్బరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## 29న వాడపల్లి దేవస్థానం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- చైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు
- ప్రమాణ స్వీకార ఏర్పాట్లుపై సమీక్ష



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకార మహెూత్సవ కార్యక్రమాన్ని ఈనెల 29న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానం చైర్మన్‌గా ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్)తో పాటు 17 మంది పాలకవర్గ సభ్యులచే ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకు తగ్గట్లుగా మంగళవారం ఆత్రేయపురం గ్రామంలో దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వగృహంలో ఆయన అధ్యక్షతన మండల కూటమి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న జరగనున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి కూటమి నాయకులను ఆహ్వానించేందుకు చేయవలసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంభద్రారాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణం రాజు, కూటమి నాయకులు ముల్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, జుజ్జవరపు హరిబాబు, పేరిచర్ల పుల్లవరాజు వర్మ, దొడ్డపనేని త్రినాధ రావు, చిటికెన సత్యనారాయణ, దండు రాంబాబు, తోట రజిని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నాలుగవ తరగతి ఉద్యోగుల భవనం స్వాధీనం



కాకినాడ, మేజర్ న్యూస్ : గత 13 సంవత్సరాలుగా ఇరువురి వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగులసంఘ భవనంను సంఘ నాయకులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఉన్న కార్యాలయం కార్యకలాపాలు కడలి శేషగిరి, వారి సోదరుడు మహేష్ చూస్తూ ఆదాయ వ్యయాలు సంఘ పెద్దలకు చెప్పకపోవడం, భవనం సంఘ నాయకులకు స్వాధీనం చేయకపోవడంతో జిల్లా కలెక్టర్ కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. 13 సంవత్సరాల కాలం నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు జరగకపోవడంతో వారే నిర్వహణ బాధ్యతలు చూస్తూ అనధికారికంగా భవనాన్ని అద్దెలకు ఇచ్చి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు మంగళవారం భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అధ్యక్షులు సవరపు చిన పాపారావు, కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు తెలిపారు.

# మీ మొదటి సంతానోత్పత్తి పరీక్షకు ఒక సరళమైన మార్గదర్శి

**– డాక్టర్ అశ్విని ఉయూరి, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,**
**ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్, రాజమండ్రి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మీ మొదటి సంతానోత్పత్తి పరీక్షకు వెళ్లడం కొంచెం భయంగా లేదా ఆందోళనగా అనిపించవచ్చుముఖ్యంగా కుటుంబాన్ని ప్రారంభించాలనే ఆలోచనలో చాలా భావోద్వేగంగా ఉన్నప్పుడు చాలా మంది సందేహాలు, ఆందోళనలు మరియు ఆశలతో వస్తారు. కానీ ఈ తొలి సందర్శన కేవలం ఒక సాధారణ అపాయింట్‌మెంట్ మాత్రమే కాదు. ఇది మీ ఆరోగ్య పరిస్థితిని స్పష్టంగా తెలుసుకోవడానికి, ముందుకు ఎలా సాగాలో అర్థం చేసుకోవడానికి సహాయపడే ముఖ్యమైన అడుగు. సరైన నిపుణుడి మార్గదర్శకంతో, ఈ పరీక్ష మీ సందేహాలను తగ్గించి, విశ్వాసంతో ముందుకు వెళ్లే దారిని చూపిస్తుంది. వంధ్యత్వం అనేది చాలామంది కేవలం మహిళల సమస్యగా భావిస్తారు. కానీ నిజానికి ఇది ఇద్దరు భాగస్వాములను సమానంగా ప్రభావితం చేస్తుంది. సుమారు 40% కేసులు పురుషుల కారణాల వల్ల, మరో 40% మహిళల కారణాల వల్ల జరుగుతాయి. మిగిలిన 20% కేసుల్లో కారణాలు ఇద్దరిలో కలిసివుండవచ్చు లేదా స్పష్టంగా తెలియకపోవచ్చు.

అందుకే, సంతానోత్పత్తి పరీక్షలు చేసేప్పుడు ఇద్దరు భాగస్వాములకూ పరీక్షలు అవసరం. ఒక్కరినే పరిశీలిస్తే కొన్ని ముఖ్యమైన కారణాలు గుర్తించబడకపోవచ్చు, దాంతో చికిత్స ఆలస్యం కావచ్చు. ఇద్దరినీ కలిసి పూర్తిగా పరిశీలిస్తే సమస్యను స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఇది జంటలు సరైన నిర్ణయాలు తీసుకుని, ఆత్మవిశ్వాసంతో తమ ప్రయాణాన్ని ముందుకు సాగించడానికి సహాయపడుతుంది. సాధారణంగా, మీ మొదటి సంతానోత్పత్తి చెకప్ వైద్యునితో ఒక వివరణాత్మక సంభాషణతో ప్రారంభమవుతుంది. మహిళల విషయంలో, నెలసరి క్రమం, గత గర్భధారణలు, గర్భస్రావాలు, శస్త్రచికిత్సలు, ఇన్ఫెక్షన్లు, తీసుకున్న మందులు, ఒత్తిడి మరియు నిద్ర అలవాట్లు గురించి అడుగుతారు. పురుషుల విషయంలో, సాధారణ ఆరోగ్యం, లైంగిక ఆరోగ్యం, గత అనారోగ్యాలు, గాయాలు లేదా వృషణాలకు సంబంధించిన సమస్యల గురించి వైద్యుడు తెలుసుకుంటారు.

ఈ సమాచారం ద్వారా వైద్యుడు సమస్యకు కారణమయ్యే అంశాలను గుర్తించి, తదుపరి పరీక్షలు లేదా చికిత్సను సరిగ్గా నిర్ణయించగలుగుతారు. దీని తర్వాత సాధారణ శారీరక పరీక్ష జరుగుతుంది. మహిళలలో బరువు, రక్తపోటు, థైరాయిడ్ మరియు హార్మోన్ల అసమతుల్యతకు సంబంధించిన లక్షణాలను వైద్యుడు చెకప్ చేస్తారు. అవసరమైతే గర్భాశయం మరియు అండాశయాల స్థితిని తెలుసుకోవడానికి సాధారణ కటి పరీక్ష చేస్తారు. పురుషుల విషయంలో, సంతానోత్పత్తి పరీక్షలో మొదటి ముఖ్యమైన దశగా వీర్య పరీక్ష (వీర్య విశ్లేషణ) చేస్తారు. ఈ పరీక్ష ద్వారా వీర్యకణాల సంఖ్య, కదలిక మరియు ఆకారం తెలుసుకోవచ్చు. ఇది పురుషుల సంతానోత్పత్తిని అంచనా వేయడానికి చాలా కీలకమైన పరీక్ష. మొదటి సంతానోత్పత్తి పరీక్షలో భాగంగా, మహిళలకు కొన్ని రక్త పరీక్షలు చేస్తారు. ఇవి ాషీన, ఖీాన, ాాన, ప్రోలాక్టిన్ మరియు థైరాయిడ్ వంటి హార్మోన్ల స్థాయిలను పరీక్షిస్తాయి. ఈ హార్మోన్లు అండాశయాలు ఎలా పనిచేస్తున్నాయి, శరీరంలో హార్మోన్ల సమతుల్యత ఉందా లేదా అన్నది తెలుసుకోవడానికి సహాయపడతాయి. కొన్ని జంటలకు ఇన్ఫెక్షన్ పరీక్షలు కూడా చేయమని వైద్యులు సూచించవచ్చు, ఎందుకంటే చికిత్స చేయని ఇన్ఫెక్షన్లు గర్భధారణకు అడ్డంకి కావచ్చు. ఈ అన్ని పరీక్షల ఫలితాల ద్వారా మీ పునరుత్పత్తి ఆరోగ్యం ఎలా ఉందో వైద్యుడు స్పష్టంగా అర్థం చేసుకుని, మీకు సరైన మార్గదర్శకాన్ని ఇవ్వగలుగుతారు. మహిళల విషయంలో సాధారణంగా అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తారు. దీని ద్వారా గర్భాశయం, అండాశయాలు మరియు ఫోలికల్స్ సంఖ్యను పరిశీలిస్తారు. ఈ స్కాన్ ఫైబ్రాయిడ్లు, తిత్తులు లేదా పాలిసిస్టిక్ అండాశయాలు వంటి సమస్యలు ఉన్నాయా లేదా తెలుసుకోవడంలో సహాయపడుతుంది. పురుషుల విషయంలో స్క్రోటల్ స్కాన్ వంటి అదనపు ఇమేజింగ్ పరీక్షలు మొదటి దశలో సాధారణంగా అవసరం ఉండవు. ప్రారంభ పరీక్షల ఫలితాల్లో అవసరం కనిపిస్తే మాత్రమే తర్వాత సలహా ఇస్తారు. ఇమేజింగ్ పరీక్షలు బయటకు కనిపించని లోపలి సమస్యలను కూడా గుర్తించడానికి డాక్టర్లకు సహాయపడతాయి, తద్వారా సరైన చికిత్సను సూచించవచ్చు. పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత, డాక్టర్ వాటిని చాలా సులభమైన మాటల్లో మీకు అర్థమయ్యేలా వివరించి చెబుతారు. ఏవి సాధారణంగా ఉన్నాయో, దీనిపై మరింత శ్రద్ధ అవసరమో, ఇకపై ఏమి చేయాలో స్పష్టంగా చెప్పబడుతుంది. ఈ చర్చ మీకు ఉన్న సందేహాలను తీర్చడంలో మరియు ముందుకు వెళ్లే సరైన మార్గాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది. ఫలితాల ఆధారంగా, మీ వైద్యుడు మీకు సమయ సంభోగం, జీవనశైలి మార్పులపై మార్గనిర్దేశం చేయవచ్చు లేదా అవసరమైతే తదుపరి చికిత్స ఎంపికల గురించి చర్చించవచ్చు. మొదటి సంతానోత్పత్తి పరీక్ష అనేది ఆందోళన చెందాల్సిన విషయం కాదు. అది మీ భవిష్యత్తును గూర్చి ముందుగానే ఆలోచించి తీసుకునే ధైర్యమైన అడుగు. ఈ అడుగు ద్వారా మీరు సకాలంలో మద్దతు మరియు సమాచార సంరక్షణ ప్రయోజనాన్ని పొందుతారు, ఆత్మవిశ్వాసం మరియు ఆశతో తల్లిదండ్రులయ్యే దిశగా మీ ప్రయాణాన్ని ప్రారంభిస్తారు.

# రొయ్య పిల్లల సీడ్ సేకరణ వివాదానికి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు



**– డిసెంబర్ 30 నాటికి శాఖల నివేదికలు**

**– అధికారులకు జాయింట్ కలెక్టర్లు ఆదేశం**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రొయ్య పిల్లల సీడ్ సేకరణకు సంబంధించి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బొబ్బర్లంక మత్స్యకారుల మధ్య సరిహద్దుల పరంగా నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్లు టీ.నిశాంతి, వై.మేఘ స్వరూప్ లు ఆదేశించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్ లో రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు జల వనరులు, మత్స్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గత 20 సంవత్సరాలుగా ధవళేశ్వరం – బొబ్బర్లంక మత్స్యకారుల మధ్య కొనసాగుతున్న రొయ్య పిల్లల సేకరణకు సంబంధించిన వివాదంపై శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం లీజు అంశంపై కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు ఈ సమావేశం ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు. ఇటీవల నియమించిన జాయింట్ కమిటీ నివేదిక ప్రకారం బొబ్బర్లంక మత్స్యకారులు ఇప్పటికీ ప్రత్యేక సహకార సంఘంగా నమోదు కాలేదని, ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం ద్వారా రెండు రకాల రొయ్య పిల్లల సీడును బ్యారేజ్ గేట్లు, గోడల లీకేజీ నీటిలో సేకరించి చెరువుల్లో పెంచి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్లు అధికారులు వివరించారు. గతంలో ధవళేశ్వరం వద్ద 70 గేట్లు, బొబ్బర్లంక వద్ద 43 గేట్లు మత్స్యకారులకు లీజుకు ఇచ్చేవారని, నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు రొయ్య సీడ్ సేకరణ జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది బొబ్బర్లంక మత్స్యకారులను సంఘాలుగా ఏర్పడాలని సూచించడంతో పాటు వివాదం పరిష్కారం అయ్యే వరకు లీజును నిలిపి వేసినట్లు వెల్లడించారు.కాటన్ బ్యారేజ్ పరిధి ఏ జిల్లా పరిధిలోకి వస్తుందో సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని, బ్యారేజ్ గేట్లు, గోడల వద్ద రొయ్య పిల్లల సేకరణ వల్ల ఆనకట్టకు పర్యావరణ పరంగా నష్టం ఉంటే జల వనరుల శాఖ శాస్త్రీయ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఇరువురు జాయింట్ కలెక్టర్లు ఆదేశించారు. అలాగే ఆనకట్ట వద్ద సేకరణ లాభనష్టాలు, డౌన్ స్ట్రీమ్‌లో సేకరణ లాభదాయకతపై మత్స్యశాఖ అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబర్ 30 నాటికి జలవనరులు, మత్స్య, సర్వే శాఖలు తమ తమ నివేదికలను సమర్పించాలని, జనవరి 22న మరోసారి పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇకపై లీజు ఒప్పందాల సమయంలో డిపాజిట్ విధానం అమలు చేసి, బ్యారేజ్ ఎకో సిస్టమ్‌కు నష్టం జరిగితే ఆ నిధుల నుంచే రికవరీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో మత్స్య శాఖ అధికారులు పి.వి.శ్రీనివాసరావు, టి.సుమలత, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి.కే. ప్రభాకర్, మత్స్య అభివృద్ధి అధికారులు, జలవనరుల శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లయ్స్ డైరెక్టర్‌గా మాలకొండయ్య బాధ్యతల స్వీకారం



**ఉమ్మడి గోదావరి జిల్లాలో సూర్య బ్యూరో :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయ్స్ డైరెక్టర్‌గా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు.విజయవాడలోని సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో జరిగినఈకార్యక్రమంలో, సంస్థ ఎండి ఢిల్లీ రావు సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే లక్ష్యం

బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాలకొండయ్య మీడియాతో మాట్లాడారు.. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా సామాన్యులకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు.

**కృతజ్ఞతలు..**తనపై నమ్మకంతో ఈకీలక బాధ్యతను అప్పగించిన ప్రభుత్వ పెద్దలకు, పార్టీ నాయకత్వానికి ఆయనఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు,పలువురు ముఖ్య నాయకులు పాల్గొని మాలకొండయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అమానుషం

**- విహెచ్‌పి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులు, దేవాలయాల విధ్వంసం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని విశ్వ హిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్ ఒక ప్రకటనలో ఖండించారు.ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువుల ఆస్తులను ధ్వంసం చేయడం, మహిళలు, పిల్లలపై హింసకు పాల్పడటం మానవ హక్కుల ఉల్లంఘనేనని మండిపడ్డారు.అక్కడి ప్రభుత్వం వెంటనే స్పందించి హిందువులకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఈ విషయంలో జోక్యం చేసుకుని హిందువుల ప్రాణ, ఆస్తి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీతా శ్లోకముల కంఠస్థ పోటీలు




**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరం డివిజన్ కేంద్రంలో స్థానిక విశ్వహిందూ పరిషత్ గిరిజన వికాస అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకముల కంఠస్థ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు విశ్వహిందూ పరిషత్ స్కూల్ కరస్పాం డెంట్ భావన్నారాయణ, విశ్వహిందూ పరిషత్ గిరిజన వికాస అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాస రావు, వెదురు నగరం స్కూల్ సిబ్బంది, రంపచోడవరం స్కూల్ సిబ్బంది, స్కూల్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, వి.హెచ్.పి. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రశంసా పత్రములు అందచేయడం జరిగింది.